

హెచ్‌ఎం యాదగిరి దంపతులను సన్మానిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

విద్యార్థులను క్రమశిక్షణలో నడిపించేది ఉపాధ్యాయులే

● హెచ్‌ఎం యాదగిరి ఉద్యోగ విరమణ సభలో డీఈఓ సుశీందర్‌రావు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మల్యాల యాదగిరి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని శనివారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యాదగిరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణలో నడిపించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం కేవలం ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. బాటసింగారం స్కూల్ అభివృద్ధికి యాదగిరి గొప్పగా కృషిచేశారని తెలిపారు. అనంతరం స్కూల్ ఉపాధ్యాయుల బృందం, బంధువులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదగిరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, ఎంఈవో జగదీశ్వర్, కవాడిపల్లి జీహెచ్‌ఎం కృష్ణయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారికి చెక్ అందజేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్

త్వరలో మార్కెట్ ఉద్యోగాల భర్తీ : చైర్‌పర్సన్ లక్ష్మి

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టనున్నట్లు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మిశ్రీనివాస్ తెలిపారు. శనివారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పి.కృష్ణమూర్తికి ప్రభుత్వం నుంచి మంజూరైన బెనిఫిట్స్ రూ.15 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్‌లలో ఉన్న ఉద్యోగాల ఖాళీలను వివరించడం జరిగిందన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌లలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్ మస్రత్ సుల్తానా, ఎస్‌జీఎస్ చిలక నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే తమ అంతిమ లక్ష్యమని, ఆ దిశలో అణగారిన వర్గాలకు అవగాహన కల్పించి రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అన్నారు. నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను శనివారం బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేతావత్ బహుగుణ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తమ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన నేతకు రాష్ట్ర పదవి దక్కడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ ఆశయాలను అనుసరిస్తూ.. కాన్షీరామ్, మాయావతి సిద్ధాంతాలను పాటిస్తూ బహుజనుల ఓటును రాజ్యాధికార సాధనకు ఉపయోగపడేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు లత్పి రాజు, ఉపాధ్యక్షుడు పల్లె కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యేందర్, కార్యదర్శి సంజీవ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి : చైర్మన్

చంపాపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జంటనగరాలలోనే ప్రసిద్ధి గాంచిన హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి కోరారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో వాహనపూజల కోసం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దాత సలుకుటి చంద్రశేఖర్‌రెడ్డి, అఖిల దంపతులు లక్ష రూపాయల విలువైన టికెట్ల విక్రయాల కోసం కంటైనర్‌ను ఆలయానికి విరాళంగా అందజేశారు. శనివారం ఆలయ ఈవో ఎస్.లావణ్య, దాతలతో కలిసి ఆలయ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై కంటైనర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు సలుకుటి బాల్‌రెడ్డి, చర్విరెడ్డి, వర్షికారెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దుర్గారెడ్డి, సంతోష్‌కుమార్, తేకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గేటు కూల్చవద్దంటూ కాలనీవాసుల అభ్యంతరం

సైదాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాత్రివేళల్లో కాలనీవాసుల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న గేటును జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేయడానికి రావడంతో సరస్వతీనగర్‌వాసులు అభ్యంతరం చెప్పడంతో ఉద్రిక్తతకు దారితీసింది. 2015లో సరస్వతీనగర్‌లో సేఫ్ కాలనీలో భాగంగా పోలీస్ కమిషనర్ సూచన మేరకు కాలనీ చుట్టు రోడ్లకు గేట్లు ఏర్పాటు చేశారు. రాత్రి 11గంటల నుంచి ఉదయం 5గంటల వరకు గేట్లు మూసివేసి ఇతరులు లోనికి ప్రవేశించకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో సమీప ఇతర కాలనీకి చెందిన రమేశ్‌చంద్రగౌడ్ అనే వ్యక్తి తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గేట్లు తొలగించాలని కోర్టు ఆదేశించడంతో శనివారం జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ భానుచందర్, సెక్షన్ ఆఫీసర్ కబీర్, ఎక్స్‌కవేటర్, సిబ్బందితో కలిసి వచ్చారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు గేట్లు తొలగింపును అడ్డుకున్నారు. తమకు వారం రోజులు సమయం ఇస్తే సమస్యను కోర్టు దృష్టికి తీసుకువెళ్తామని కోరడంతో అధికారులు వెనుదిరిగారు. దీంతో గేటు తొలగింపు పనులు తాత్కాలికంగా వాయిదా పడింది.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి, మిలాద్-ఉన్-నబీ పండుగలను పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పర్యవేక్షణలో సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామని ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలోని రక్షాపురం, ఆర్‌ఎన్‌కాలనీ, ఈదీబజార్, మోయిన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు దారి పొడవునా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతవాతావరణంలో జరిపేందుకు ఇప్పటికే నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశామన్నారు. ప్రజలు పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని వదంతులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, ఎస్‌ఐలు మణికంఠ, రవిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో మరచిపోయిన మొబైల్‌ను ప్రయాణికుడికి అప్పగించిన కండక్టర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన రూట్ నంబర్ 555 దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్ వెళ్తున్న బస్సులో శనివారం ఓ ప్రయాణికుడు తన మొబైల్ ఫోన్‌తో కూడిన బ్యాగ్‌ను మరచిపోయి బస్సు దిగిపోయాడు. బస్సులో బ్యాగ్‌ను గుర్తించిన కండక్టర్ జితేందర్‌రెడ్డి, డ్రైవర్ శ్రీనివాస్‌లు కలిసి ప్రయాణికుని వివరాలు సేకరించి సమాచారం ఇచ్చారు. వెంటనే ప్రయాణికుడు చౌటుప్పల్ బస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న డిపో కంట్రోలర్ నగేష్ సమక్షంలో బ్యాగ్‌ను ప్రయాణికుడికి అప్పగించారు. కండక్టర్ జితేందర్‌రెడ్డి నిజాయితీని ప్రయాణికుడు ప్రశంసించాడు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్ : గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ చెరువు కట్టపై గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు రోజంతా శ్రమిస్తు నిమజ్జనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్, శ్రవణ్‌కుమార్, సుధీర్ పాల్గొన్నారు.



సద్గురునగర్‌లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కంచర్ల కవిత తదితరులు



టీచర్స్‌కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు శివముదిరాజ్



ఇంద్రప్రస్థకాలనీలో గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, పంతులు కరుణాకర్



లక్ష్మీనగర్‌కాలనీ మండపం వద్ద మాట్లాడుతున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్, పక్కన ఏసీపీ సోము వెంకట్‌రెడ్డి తదితరులు

గణనాథుడికి ఘనంగా పూజలు

చంపాపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శనివారం సినీహీరో, నటకిరీటి రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన రాజేంద్రప్రసాద్‌కు ఆలయ పండితులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని ధ్యానాంజనేయస్వామిని రాజేంద్రప్రసాద్ దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలోని గణపతిని రాజేంద్రప్రసాద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎనుముల రవీందర్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

ఎల్బీనగర్: సరూర్‌నగర్ జ్యోతి క్లబ్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి మండపం వద్ద శనివారం సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. ప్రత్యేక పూజ ల్లో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు శేఖర్‌జీ, మల్కాజిగిరి కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

మధురానగర్‌కాలనీలో సామూహిక హారతి

మన్సూరాబాద్: భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ మధురానగర్‌కాలనీలో



మారుతీనగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

ఏర్పాటు చేసిన గణనాథుడికి మండపం వద్ద శుక్రవారం రాత్రి సామూహిక హారతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని పలు మండపాల్లోని గణనాథులను ఆయన దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి పలు మండపాల్లోని గణనాథులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గణపయ్య సేవలో నేతలు, అధికారులు

సరూర్‌నగర్ : బాలాపూర్ బడా గణేశ్‌తో పాటు బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను అధికారులు,



హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడిని దర్శించుకున్న సినీహీరో రాజేంద్రప్రసాద్

నేతలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. బాలాపూర్ వినాయకుడిని తహసీల్దార్ ఇందిరాదేవి దంపతులు, మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ నాగమణి,



మధురానగర్‌కాలనీ గణనాథుడికి సామూహిక హారతిలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి, కాలనీవాసులు



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహగౌడ్ దంపతులు

ఏఎంసీ నాగేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహగౌడ్ దర్శించుకున్నారు.



హస్తినాపురం డివిజన్ శ్రీరమణకాలనీ ఫేజ్-2లో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడిని దర్శించుకున్న కార్పొరేటర్ సుజాతానాయక్

స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా నూతన కమిటీ సభ్యులకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శామీర్‌పేటలోని ఎంపీ కార్యాలయంలో శనివారం జిల్లా నూతన కమిటీ సభ్యులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈటలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఆయన బీజేపీ పటిష్ఠతకు పాటుపడాలని సూచించారు. ఈటలను కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బొల్గం యశ్పాల్‌గౌడ్, బండారి భాస్కర్, మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రుద్రారం శంకర్, రాధాకృష్ణయాదవ్, నందికొండ గీతారెడ్డి, రాజేంద్రప్రసాద్, మూలా అనిల్‌గౌడ్, శ్రవంతి, కోశాధికారి కృష్ణంరాజు,



వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా నూతన కమిటీ సభ్యులు

కార్యదర్శులు మణిభూషణచారి, నూతి శ్రీనివాస్‌రావు, నరేష్‌యాదవ్, మాణిక్‌రావు, సుందర్‌నారాయణ, దుర్గాప్రసాద్, పార్టీ కార్యాలయ కార్యదర్శి ఎడ్ల అమరేశ్వర్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి కందుల అమూల్యారెడ్డి, మీడియా ఇన్‌చార్జి నీలా ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

● అనాజ్‌పూర్‌లో స్వచ్ఛందంగా దుకాణాల బంద్, ధర్నా

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకులు, సీలింగ్ పట్టా రైతుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో ఆ పార్టీ నాయకులు, సీలింగ్ పట్టా రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా గ్రామంలోని దుకాణాలను స్వచ్ఛందంగా బంద్‌చేశారు. ఈ సందర్భంగా గ్రామ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ సీపీఎం ఎలాంటి బంద్‌కు పిలుపు ఇవ్వకున్నా పోలీసులు పార్టీ నాయకులతో పాటు సీలింగ్ పట్టా రైతులను శనివారం అక్రమంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, పోలీసుల తీరును వారు ఖండించారు. అక్రమ అరెస్టు, కేసులకు బయపడేది లేదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. సీలింగ్ పట్టా రైతులకు పాస్‌బుక్‌లు ఇచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఇప్ప



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

టికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుమలత, మండల కమిటీ సభ్యులు గుండె శివకుమార్, ముత్యాలు, జంగయ్య, శివకుమార్, కనకయ్య, శ్రీశైలం, బాల్‌రాజ్, మహేష్, రాములు, భిక్షపతి, ఇంజమూర్ రవి, యాదయ్య పాల్గొన్నారు.

మీర్‌పేట్, బీఎన్‌రెడ్డినగర్‌లో గణేశుడి లడ్డూల చోరీ

సరూర్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లో లడ్డూ చోరీ జరిగింది.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే భక్తులు తాము ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలో లడ్డూ ప్రసాదం పెట్టి పూజించడం సంప్రదాయం. కాగా కొందరు ఆకతాయిల దృష్టి సదరు లడ్డూ ప్రసాదం మీద పడింది. ఈ క్రమంలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలోని లంబోదరుడి లడ్డూను శుక్రవారం అర్ధరాత్రి దాటింతర్వాత ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి, నిర్వాహకులు గాఢ నిద్రలో ఉండడం గమనించి చడీచప్పుడు కాకుండా ఎత్తుకుని వెళ్లిపోయారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో ఈ లడ్డూ చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. జిల్లెలగూడలోని ఓ మండపంలోని నిర్వాహకుల మొబైల్ ఫోన్లు సైతం అపహరణకు గురయినట్టు తెలిసింది. అయితే తమకు అలాంటి ఫిర్యాదు ఏదీ అందలేదని పోలీసులు పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

వనస్థలిపురం : పవిత్రమైన గణనాథుడి లడ్డూను గుట్టుచప్పుడు కాకుండా మైనర్లు దొంగిలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ విజయపురికాలనీ ఫేజ్-2కు చెందిన 8 మంది మైనర్లు గుంపుగా ఏర్పడి గణేశ్ మండపాల వద్దకు తిరుగుతూ గణనాథున్ని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో విజయపురికాలనీలోని రోడ్డు నం.18లో భారత్‌మాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని మండపం వద్ద పూజలు ముగిసిన అనంతరం శుక్రవారం అర్ధరాత్రి మండప నిర్వాహకులు నిద్రిస్తున్నారు. ఇది గమనించిన మైనర్లు గుట్టుచప్పుడు కాకుండా గణనాథుని చేతిలో ఉన్న లడ్డూను దొంగిలించి అక్కడి నుంచి పారిపోయారు. తెల్లవారి మండప నిర్వాహకులు గమనించగా లడ్డూ మాయమైనట్లు గ్రహించి మండపంలోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో లడ్డూ దొంగ



మీర్‌పేట్ జనార్దన్‌రెడ్డినగర్‌లో గణేశ్ మండపం నుంచి లడ్డూ ఎత్తుకెళ్తున్న యువకులు

తనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీనగర్‌లో సైతం..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ సౌత్ రోడ్ నంబర్ 1లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలో 5కిలోల లడ్డూను ఏర్పాటు చేశారు. ఈ లడ్డూను సైతం గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఇది కూడా విజయపురికాలనీలో లడ్డూ దొంగల పనేనని కాలనీవాసులు అనుమానిస్తున్నారు.

సర్వే నంబర్ చిరునామాతో ఓటు హక్కు ఎలా కల్పిస్తారు?

● ఓటరు లిస్టులో చాలా తప్పులు.. గత మీటింగ్‌లోని అభ్యంతరాలను నేటికీ పరిష్కరించలే

● రెండు రోజుల్లో ఎలా సాధ్యం.. బీఎల్‌ఓలు ఎంక్వైరీ చేయకుండానే ఓటు హక్కు కల్పించారు

● రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఎంపీడీవోను నిలదీసిన నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకపై మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నేతలు మండల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న బీఎల్‌వోలు ఓటు నమోదు, తొలగించడంలో కనీసం విచారణ చేపట్టకుండానే ఇష్టానుసారంగా వ్యవహరించారని దాంతో ఓటరు జాబితా తప్పుల తడకగా తయారైందని అసహనం వ్యక్తం చేశారు. ముసాయిదా ఓటరు జాబితాపై శనివారం హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, డీఈఈ ఇంద్రాసేనారెడ్డి, ఎంపీవో మధుసూదనాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాపై అన్ని పార్టీల ప్రతినిధులు ఎంపీడీవోని నిలదీశారు. 10నెలల క్రితం నిర్వహించిన ఆల్‌పార్టీ ప్రతినిధుల సమావేశంలో అభ్యంతరాలను నేటికీ పరిష్కరించలేదని ఇప్పుడు ఎలా సాధ్యమవుతుందని ఎంపీడీవోని ప్రశ్నించారు. కేవలం రెండు రోజులు మాత్రమే సమయం కేటాయించి ఇప్పుడు పరిష్కరిస్తామంటే తాము



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, పక్కన ఎంపీడీవో శ్రీవాణి

నమ్మలేమని తెలిపారు. ఓటరు లిస్టును ఇవ్వకపోగా దీనిపై కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మజీద్‌పూర్ గ్రామంలో సర్వే నంబర్ చిరునామాతో 70ఓట్లు నమోదు చేశారని కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవోకు వివరించారు. అదేవిధంగా ఖాళీ ప్లాట్, ప్రీకాస్ట్ గోడల చిరునామాలతో ఓటు హక్కు కల్పించారని వెల్లడించారు. ఒకే ఇంటి అడ్రస్‌పై 20ఓట్లు నమోదు చేశారన్నారు. గతంలో ఇచ్చిన అభ్యంతరాల సంగతి ఏమిటని గుంతపల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్ కరిమెల ప్రశ్నించారు. పెద్ద సంఖ్యలో అడ్రసు లేని వారి ఓట్లు నమోదు చేశారని.. చనిపోయిన, పెండ్లీ అయిన వారి ఓట్లను తొలగించలేదని వివరించారు. వార్డు జాబితా లిస్టును కూడా సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫైనల్ పబ్లికేషన్‌లోగా జాబితాను సవరించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. అభ్యంతరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన విషయంలో కూడా మండల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అన్ని పార్టీల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తపరిచారు. అన్నిపార్టీల మండల నాయకులు పాల్గొన్నారు.



వరదనీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాలనీ సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కొనసాగుతున్న వరదనీటి పైపులైన్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు రాజేశ్వర్, పద్మిని, భాస్కర్ పాల్గొన్నారు.

మాసబ్‌చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం

హయత్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మాసబ్ చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం జోరుగా సాగుతుంది. పెద్ద ఎత్తున విగ్రహాలను తీసుకుని వచ్చి నిమజ్జనం చేస్తున్నారు. చెరువు పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి, ఎల్బీనగర్, హస్తినాపురం, హయత్‌నగర్, సాహెబ్‌నగర్, తుర్కయంజాల్, ఇంజాపూర్, రాగన్నగూడ, కమ్మగూడ ప్రాంతాల నుంచి భారీగా విగ్రహాలు తీసుకువచ్చి చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. శనివారం ఒక్క రోజే చిన్న, పెద్దవి సుమారు 600వరకు విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడు షిఫ్టుల ద్వారా సేవలు అందిస్తున్నట్లు కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడంలో అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ అన్నారు. శనివారం గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మలక్‌పేట పోలీస్‌స్టేషన్ మైత్రీ కమిటీ కన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇన్‌స్పెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 150 గణేశ్ విగ్రహాలను ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై దృష్టి పెట్టాలి

కొత్తపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై దృష్టి పెట్టాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. శనివారం టీటీఐ అధికారులు 17 ప్రాంతాల్లో చేపట్టిన అవగాహన కార్యక్రమాలను వివరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని జిల్లెలగూడ, బాలాపూర్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, ఎల్బీనగర్ చౌరస్తాలలో వాహనదారులకు, జిల్లెలగూడ జడ్పీహెచ్‌ఎస్‌లలో విద్యార్థులకు 18 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమాల్లో 626 మంది విద్యార్థులకు, వాహనదారులకు ఎస్‌ఐ నర్సింహారావు, ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారని తెలిపారు.

బబ్బూరి యశోదకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బబ్బూరి దేవేందర్‌గౌడ్ తల్లి బబ్బూరి యశోద దశదిన కర్మ కార్యక్రమం శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరై యశోద చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, తూళ్ల వీరేందర్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సాయికుమార్‌గౌడ్, కిషన్‌గౌడ్, చక్రవర్తి, తొర్పునూరి ధనుంజయగౌడ్, జక్క రాంరెడ్డి, బిందు రంగారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, గోపాల్‌గౌడ్, తొర్పునూరి ప్రవీణ్‌గౌడ్ తదితరులు నివాళులర్పించారు.



బబ్బూరి యశోద చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్ తదితరులు